క్లుప్తంగా

ఘనంగా బొడ్రాయి వార్షికోత్సవం



హోమాలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

నందిగామ: మండల పరిధిలోని మొదళ్లగూడలో బొడ్రాయి ప్రతిష్ఠించి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రథమ వార్షికోత్సవాన్ని శుక్రవారం గ్రామస్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బొడ్రాయి వద్ద గ్రామస్తులు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు నవీన్‌గౌడ్, సుదర్శన్, సతీశ్, చంద్రారెడ్డి, గోపాల్ రెడ్డి, రాజలింగం, నర్సింహులు, శ్రీకాంత్ రెడ్డి, వేమారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షాబాద్‌లో..



బోనాలతో ఊరేగింపులో గ్రామస్తులు

షాబాద్: ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని శుక్రవారం షాబాద్ గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన వార్షికోత్సవం శ్రీను పంతులు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం బోనాలతో ఊరేగింపు అంగరగం వైభంగా సాగింది. ఉదయం నుంచి భక్తులు బొడ్రాయి వద్ద బారులు తీరి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా తరలివచ్చి నైవేద్యం సమర్పించారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ జడల లక్ష్మీ రాజేందర్‌గౌడ్, మాజీ సర్పంచులు తమ్మలి సుబ్రమణ్వేశ్వరి రవీందర్, వెంకట్‌యాదవ్, ఎంపీటీసీ అశోక్, బీజేపీ మండల అధ్యక్షుడు కిరణ్, బీజేవైఎం స్వచ్ఛ భారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము, రవీందర్, దండు రాహుల్‌గుప్తా, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నల్లా కనెక్షన్లపై సర్వే చేయించండి

ఎంపీడీఓ వెంకయ్య



మాట్లాడుతున్న ఎంపీపీ గీత. చిత్రంలో ఎంపీడీఓ వెంకయ్య

శంకర్‌పల్లి: రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం మండలంలోని నల్లా కనెక్షన్లపై ఇంటింటి సర్వే చేసి, యాప్‌లో నమోదు చేయాలని శంకర్‌పల్లి ఎంపీడీఓ వెంకయ్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం శంకర్‌పల్లి ఎంపీడీఓ కార్యాలయంలో నల్లా కనెక్షన్లపై ఎంపీపీ గీత, మిషన్ భగీరథ ఏఈ చంద్రమోహన్‌రెడ్డితో కలిసి పంచాయతీ కార్యదర్శులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్‌తో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశానుసారంగా గ్రామంలోని ప్రతి ఇంట్లో నల్లా కనెక్షన్ చెక్ చేసి, ఆ నల్లా ఫొటోని సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ ప్రక్రియను సోమవారం నుంచి ప్రారంభించి, వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. అధికారులు విధుల్లో ఎక్కడ అలసత్వం వహించొద్దని, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

జీపీ కార్మికులకు జీతాలు ఇవ్వాలి



ఎంపీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తలకొండపల్లి: గ్రామ పంచాయతీ సిబ్బందికి తక్షణమే జీతాలు విడుదల చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గ్రామ పంచాయతీ వర్కర్స్, అండ్ సీఐటీయూ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నాయకులు ఎంపీఓ రఘుకు వినతిపత్రం అందజేశారు. ఆరు నెలలుగా పంచాయతీ సిబ్బందికి జీతాలు ఇవ్వడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు లేకపోవడంతో కుటుంబ పోషణ భారమై వారి కుటుంబాలు వీధిన పడే పరిస్థితి దాపురించిందన్నారు. వెంటనే పెండింగ్ జీతాలను విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య, జిల్లా కార్యదర్శి పాండు, తదితరులు పాల్గొన్నారు.



కంకర తేలిన రోడ్డు



కమ్మదనం, కేశంపేట రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంత

రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా..?

గుంతల మయంగా షాద్‌నగర్-ఆమనగల్లు రోడ్డు

- అర్ధంతరంగా ఆగిన పనులు
- ఇబ్బందుల్లో ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు

కేశంపేట: షాద్‌గనర్ నుంచి ఆమనగల్లుకు వెళ్లాలంటే 50 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఫరూఖ్‌నగర్, కేశంపేట, తలకొండపల్లి, ఆమనగల్లు మండలాల పరిధిలో గ్రామాలను కలుపుతు రోడ్డు విస్తరించి ఉంది. షాద్‌నగర్ నుంచి శ్రీశైలం, నాగార్జున సాగర్, నల్గొండ వెళ్లడానికి ఈ రోడ్డు అనుకూలంగా ఉంటుంది. దీంతో ఈ రోడ్డు పైన ఎప్పుడూ వాహనల రద్దీ అధికంగా ఉంటుంది. ఈ సందర్భంగా దీన్ని గతంలోనే డబుల్‌రోడ్డుగా మార్చారు. ఆమనగల్లు నుంచి కేశంపేట గ్రామం వరకు, షాద్‌నగర్ పట్టణంలోని బైపాస్ రోడ్డు నుంచి ఫరూఖ్‌నగర్ మండలంలోని కమ్మదనం గ్రామం వరకూ బీటీ వేశారు. కమ్మదనం గ్రామం నుంచి కేశంపేట గ్రామం వరకూ రోడ్డును బాగుచేయకపోవడం వల్ల గుంతలు ఏర్పడి రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నిలిచిపోయిన పనులు

షాద్‌నగర్ బైపాస్ రోడ్డు నుంచి కేశంపేట వరకు సుమారు 20 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల ముందు రూ. 15 కోట్లను మంజూరు చేసింది. షాద్‌నగర్ పట్టణంలోని బైపాస్ రోడ్డు నుంచి ఫరూఖ్‌నగర్ మండలంలోని కమ్మదనం గ్రామం వరకూ బీటీ రహదారిని ఎన్నికల ముందు పూర్తిచేశారు. కమ్మదనం గ్రామం నుంచి మండల కేంద్రం వరకు రోడ్డు నిర్మాణ పనులను మధ్యలోనే ఆపేశారు.

భయం.. భయంగా ప్రయాణం!

ఫరూఖ్‌నగర్ మండలంలోని కమ్మదనం గ్రామం నుంచి కేశంపేట గ్రామం వరకు సుమారు 15కిలోమీటర్ల దూరం వరకు రోడ్డుపై ఎక్కడ చూసినా గుంతలే దర్శనమిస్తున్నాయి. ఈ రోడ్డు నుంచి ప్రయాణం చేయాలంటే వాహనదారులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిగుండా వెళ్లాలంటే భయం..భయంగా ప్రయాణం చేయాల్సిందే. రాత్రి వేళల్లో గుంతలు కానరాక చాలా మంది ప్రయాణీకులు కిందపడిన సంఘటనలూ ఉన్నాయి. కేశంపేట నుంచి షాద్‌నగర్‌కు వాహనాల రద్దీ అధికంగా ఉండటంతో రోడ్డుపైన ప్రయాణించే వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

త్వరగా పూర్తి చేయాలి...



కేశంపేట నుంచి షాద్‌నగర్ వెళ్లే రోడ్డుపైన గుంతలు ఉండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బైక్‌పై వెళ్లాలంటే కూడా భయం వేస్తుంది. రాత్రివేళలో గుంతలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు పైన గుంతలను త్వరగా బాగుచేయించి, పనులను త్వరగా పూర్తి చేయాలి.

– కర్నేకోట వినోద్‌కుమార్, కొండారెడ్డిపల్లి, కేశంపేట

సత్వరమే పనులు ప్రారంభిస్తాం...

ఫరూఖ్‌నగర్ మండలంలోని కమ్మదనం గ్రామం నుంచి కేశంపేట మండల కేంద్రం వరకు 15 రోజుల్లోగా పనులు ప్రారంభిస్తాం. కాంట్రాక్టర్ రోడ్డు వేసేందుకు సిద్ధంగా ఉన్నాడు. త్వరలోనే ఆగిపోయిన రోడ్డు పనులను పూర్తి చేయిస్తాం. కేశంపేట గ్రామంలోని వైఎస్సార్ చౌరస్తా వద్ద వర్షపునీరు నిలుస్తుంది, రోడ్డు నిర్మాణం చేసేటప్పుడు దాన్ని సరిచేయిస్తాం.

– రవితేజ, ఏఈ (ఆర్అండ్‌బి), కేశంపేట

స్పేర్ పంపులు, టార్పాలిన్లు పంపిణీ

షాబాద్: షెడ్యూల్ కులాలకు చెందిన రైతులకు స్పేర్ పంపులు, టార్పాలిన్లు పంపిణీ చేసినట్లు సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ గొల్లపల్లి రత్నాకర్ పేర్కొన్నారు. శుక్రవారం ముద్దెంగూడ, తిర్మలాపూర్, బొబ్బిలిగామ, రేగడిదోస్వాడ గ్రామాలకు చెందిన షెడ్యూల్ కులాల రైతులకు ఉప ప్రణాళిక ద్వారా స్పేర్ పంపులు, టార్పాలిన్లు సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. సుగుణ మాల రైతు ఉత్పత్తి దారుల సంఘంలోని షెడ్యూల్ కులాలకు చెందిన రైతులకు భారతీయ నూనె గింజల పరిశోధనా స్థానం రాజేంద్రనగర్ వారి ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ షెడ్యూల్ కులాలకు చెందిన రైతులకు నూనె గింజల సాగు వివరాలు, ఆదాయం పెంపు వంటి విషయాలను వివరించారు. సంఘం ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను వివరించారు. భారతీయ నూనె గింజల పరిశోధనా ప్రతినిధి రాథోడ్ మాట్లాడారు. భారతీయ నూనె గింజల పరిశోధనా స్థానం నూనె గింజలసాగు అందిస్తున్న సేవలు రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు లింగం, డైరెక్టర్లు కూర వెంకటయ్య, అంజయ్య, భూపతిరాజు, యాదవరెడ్డి, నర్సింహా, శేఖరయ్య, సుదర్శన్, రవీందర్‌రెడ్డి, మాధవరెడ్డి, శంకర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



స్పేర్ పంపులు, తార్పాలిన్లు పంపిణీ చేసిన గొల్లపల్లి రత్నాకర్, తదితరులు



కొందుర్గులో కురుస్తున్న వర్షం



షాబాద్‌లో కురుస్తున్న వర్షం

విస్తారంగా వానలు!

- ఖరీఫ్ సాగుకు అనుకూలం
- పొలాలను సిద్ధం చేసుకుంటున్న రైతులు

కొందుర్గు: సరైన సమయానికి వర్షం కురియడంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా రైతన్నలు రోహిణి, మృగశిర కార్తెలలో వర్షాలు కురిస్తే ఖరీఫ్ పంటలు సాగు చేయడానికి మొగ్గచూపుతారు. కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో వారం రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం భారీ వర్షం కురియడంతో రైతన్నలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సరైన సమయానికి వర్షం కురిసిందని, విత్తనాలు నాటడానికి ఇదే అనువైన సమయమని రైతులు చెబుతున్నారు. ముఖ్యంగా పత్తి, మొక్కజొన్న విత్తనాలు వేయడానికి ఈ వర్షం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రైతన్నలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

షాబాద్‌లో..

షాబాద్: షాబాద్ మండల పరిధిలోని షాబాద్, సర్దార్‌నగర్, నాగర్‌గూడ, తాళ్లపల్లి, హైతాబాద్, చందనవెళ్లి, ఏట్ల ఎర్రవల్లి, తిమ్మారెడ్డిగూడ తదితర గ్రామాల్లో శుక్రవారం భారీ వర్షం కురిసింది. సుమారు రెండు గంటల పాటు ఈదురు గాలులతో కూడిన వానొచ్చింది. దీంతో రైతులు పంటల సాగుకు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు.



షాద్‌నగర్: ఓ దుకాణంలో చేరిన వరద

షాద్‌నగర్ లో..

షాద్‌నగర్ : ఎలికట్ట, మొగిలిగిద్ద, లింగారెడ్డిగూడ, చిల్కమర్రి తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. షాద్‌నగర్ పట్టణంలోని దుకాణ సముదాయలతోపాటు ఇళ్లలోకి నీరు చేరింది. పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులోని ఓ కాంప్లెక్స్‌లో సెల్లార్‌లోని దుకాణాల్లో వరద ముంచెత్తింది. దీంతో లక్షల్లో ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. భగత్‌సింగ్ కాలనీ, ప్యారడైజ్ కాలనీ, గాంధీనగర్ కాలనీ, న్యూటౌన్ షిప్ కాలనీల్లోకి వరద చేరడంతో ఇళ్లలోకి వెళ్లేందుకు కాలనీ వాసులు ఇబ్బందులకు గురయ్యారు.

గాదె పవన్‌కుమార్‌కు డాక్టరేట్ ప్రదానం

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని హిమాయత్‌నగర్ సమీపంలోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో గాదె పవన్‌కుమార్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. యువ సాంకేతిక శాస్త్ర విభాగంలో 'స్క్రీనింగ్ అండ్ మాలిక్యూలర్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ ఫెస్టిసైట్స్ డిగ్రేడింగ్ బ్యాక్టీరియా ఫ్రమ్ అగ్రికల్చర్ సాయిల్ ఇన్ తెలంగాణ రీజియన్' అనే అంశంపై ఆచార్య రాజేందర్ వడ్లూరి పర్యవేక్షణలో గాదె పవన్‌కుమార్ పరిశోధన పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆయనకు డాక్టరేట్ లభించింది. యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ఆచార్య క్రిష్టఫర్ గాదె పవన్‌కుమార్‌ను అభినందించి డాక్టరేట్ ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో అగ్రికల్చర్ సాయిల్ డిగ్రేడింగ్ బ్యాక్టీరియా లాంటి పరిశోధనలు రైతులకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేషన్ అధికారి సాత్వికరెడ్డి, రిజిస్ట్రార్ రవీందర్, జగదీశ్వర్, సుందర్‌రామ్, రాజు, పబ్లిక్ రిలేషన్ అధికారి గాదె రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు పుస్తకాలు పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ వెంకట్‌రామ్ రెడ్డి

షాద్‌నగర్ రూరల్: ఫరూఖ్‌నగర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు శుక్రవారం జెడ్పీటీసీ వెంకట్‌రామ్ రెడ్డి, ఎంపీపీ మహ్మద్ ఇద్రీస్ పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ శంకర్ రాథోడ్ మాట్లాడుతూ మండలంలోని 70 పాఠశాలలకు గాను 60వేల పుస్తకాలు రావాల్సి ఉండగా ప్రస్తుతం 32వేల పుస్తకాలు వచ్చాయన్నారు. త్వరలో మిగతా పుస్తకాలు వస్తాయని చెప్పారు. అదేవిధంగా విద్యార్థులకు యూనిఫామ్స్ కుట్టే బాధ్యతను మహిళా సంఘాలకు అప్పగించిన విషయాన్ని గుర్తు చేశారు. త్వరలోనే విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి



వాటర్ ఫిల్టర్ ప్రారంభిస్తున్న మధుసూదన్‌రెడ్డి

కొత్తూరు: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు తనవంతు సహకారం అందిస్తానని కొత్తూరు ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన తాగునీటి వాటర్ ఫిల్టర్‌ను ప్రారంభించారు. తండాలో స్వచ్ఛమైన నీటి సరఫరా అందించేందుకు వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేయాలని కోరగానే ఎంపీపీ స్పందించడం సంతోషకరమని తండావాసులు పేర్కొన్నారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల్లో మండల పరిషత్ నిధులతో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. అవసరమైన చోట్ల సీసీరోడ్లు, మురుగునీటి కాల్వలను నిర్మించి ప్రజల సమస్యలను పరిష్కరించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో హరితారెడ్డి, రవినాయక్, రాందాస్‌నాయక్, దశరథ్‌నాయక్, నర్సింహ్మారెడ్డి, జయేందర్‌రెడ్డి, దయానంద్‌రెడ్డి, రాములుగౌడ్, మల్లేష్, మోడి దర్శన్, జగన్, నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.

నీట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులు



దీపిక 720/696



రిషిత 720/625

శంకర్‌పల్లి: ఇటీవల ప్రకటించిన నీట్ ఫలితాల్లో ఆల్ ఇండియా స్థాయిలో శంకర్‌పల్లి విద్యార్థిని దీపిక సత్తా చాటింది. ప్రొద్దటూర్ గ్రామానికి చెందిన గండిచెర్ల గోవర్ధన్‌రెడ్డి, మాధవి దంపతుల కుమార్తె దీపిక. ఈమె మియాపూర్ శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసింది. అనంతరం నీట్ పరీక్షా రాయగా 720 మార్కులకు గాను 696 సాధించి, ఆల్‌ఇండియాలో 2,672 ర్యాంకు సాధించింది. కుమార్తె మంచి ర్యాంకు సాధించడంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని వారు ఆకాంక్షించారు.

మొయినాబాద్‌లో..

మొయినాబాద్: చిలుకూరు గ్రామానికి చెందిన విద్యార్థిని దర్గ రిషిత మంచి ప్రతిభ చాటింది. గ్రామానికి చెందిన నరేందర్, వందన దంపతుల కూతురు రిషిత శ్రీచైతన్య కళాశాలలో చదివి నీట్ రాసింది. ఇటీవల విడుదలైన ఫలితాల్లో 720 మార్కులకు గాను 625సాధించి ప్రతిభ కనబరిచింది. నీట్‌లో ఉత్తమ ఫలితం సాధించిన రిషితను గ్రామంలోని పలువురు నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు అభినందించారు.

నకిలీ విత్తనాలు విక్రయించొద్దు

మండల వ్యవసాయాధికారి రాగమ్మ



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

మొయినాబాద్: సీడ్స్ షాపుల్లో నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి రాగమ్మ డీలర్లను హెచ్చరించారు. మండల పరిధిలోని వెంకటాపూర్‌లో శుక్రవారం సీడ్స్ అండ్ ఫర్టిలైజర్ షాపులో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్‌తో కలిసి ఆమె తనిఖీలు నిర్వహించారు. షాపులో అమ్ముతున్న విత్తనాలు, ఎరువులను పరిశీలించారు. రికార్డులను పరిశీలించి ఏయే విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలను అందుబాటులో ఉంచాలన్నారు. రైతులు అడిగిన రకం విత్తనాలు కాకుండా ఇతర రకాలు ఇవ్వవద్దన్నారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని.. రైతుల వివరాలను నమోదు చేసుకోవాలని చెప్పారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌కు అవసరమైన పత్తి, వరి, మొక్కజొన్న, కంది విత్తనాలను అందుబాటులో ఉంచాలని సూచించారు.

హద్దులు ఏర్పాటు చేయండి

కొత్తూరు: మండలంతో పాటు కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన రియల్ వెంచర్లలో ఆయా పంచాయతీలకు కేటాయించిన పదిశాతం స్థలాలకు అధికారులు హద్దులు ఏర్పాటు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి షకీల్ శుక్రవారం ఒక ప్రకటనలో అధికారులను కోరారు. ఇప్పటికే అధికారుల నిర్లక్ష్యం కారణంగా చాలా వెంచర్లలో పదిశాతం స్థలాలు కబ్జాలకు గురైనట్లు పేర్కొన్నారు. మరికొన్ని చోట్ల పత్రాల్లో నమోదు చేసిన స్థలాల విస్తీర్ణం క్షేత్రస్థాయిలో ఉన్న విస్తీర్ణాలకు వ్యత్యాసం ఉందని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పదిశాతం స్థలాలకు సర్వేలు చేపట్టి హద్దులు, కంచెలు ఏర్పాటు చేయాలని కోరారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ యాదమ్మ అధ్యక్షతన నిర్వహించాల్సి ఉండగా వాయిదా వేసినట్లు ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ సమావేశానికి కోరం లేకపోవడంతో వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశాన్ని తిరిగి ఈ నెల 12న నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



కొందుర్గు: ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, అధికారులు



మొయినాబాద్‌రూరల్: ఇంటింటి ప్రచారంలో పోచయ్య తదితరులు

- ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్
- బడీడు పిల్లలు బడిలోనే ఉండాలి
- ఎస్‌టీఎఫ్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు పోచయ్య

కొందుర్గు: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య బోధన చేస్తారని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. బడిబాటలో భాగంగా శుక్రవారం చౌదరిగూడ మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారని, విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, మధ్యాహ్న భోజనం ఉంటుందన్నారు. బడీడు పిల్లలందరిని బడిలో చేర్పించాలన్నారు. బడి పిల్లలను ఆయా పనులకు పంపిస్తే ప్రభుత్వం చట్టరీత్యా చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కిష్టారెడ్డి, కాంప్లెక్స్ హెచ్ఎం విల్సన్ సునీల్, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మొయినాబాద్‌రూరల్‌లో..

మొయినాబాద్‌రూరల్: బడీడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలని ఎస్‌టీఎఫ్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు యూ పోచయ్య పేర్కొన్నారు. ఎన్కెపల్లి గ్రామంలో ఉపాధ్యాయులు ఇంటింటికి తిరుగుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలందరిని ప్రభుత్వ పాఠశాలల్లో చేరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంజుల, బందయ్య, రాములు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.